క్లుప్తంగా

రేపు యాంటీ రేబిస్ టీకాలు


డాక్టర్ కె.సత్యనారాయణ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా ఆదివారం రాజమహేంద్రవరం పశువుల ఆస్పత్రిలో పెంపుడు జంతువులకు ఉచితంగా రేబిస్ టీకాలు వేయనున్నారు. ఏరియా పశువుల ఆసుపత్రి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.సత్యనారాయణ శుక్రవారం ఈ విషయం తెలిపారు. అలాగే పెంపుడు జంతువుల యజమానులకు, పారిశుధ్య కార్మికులకు, పశు సంవర్ధక శాఖ సిబ్బందికి, జంతువులతో సంబంధం ఉన్న వ్యక్తులకు కూడా యాంటీ రేబిస్ టీకాలు వేస్తామన్నారు.

ఘనంగా నేదునూరి గంగాధరం జయంతి

సీటీఆర్ఐ: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తరతరాలుగా పల్లె ప్రజలు వాడుకునే జానపదాలపై నేదునూరి గంగాధరం పరిశోధనే నేటికీ ప్రామాణికమని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ విభాగాధిపతి డాక్టర్ తటపట్ల సత్యనారాయణ అన్నారు. జానపద వాజ్మయోద్ధరక నేదునూరి గంగాధరం జయంతిని శుక్రవారం స్థానిక నేదునూరి గంగాధరం స్మారక గ్రంథాలయంలో ఆయన కుమార్తె సూర్యప్రభావతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ఆనాటి జనజీవనంలో ఉన్న మాండలీకాలు, జానపదాలు, పాటలు, గేయాలపై గంగాధరం పరిశోధించిన జానపద వాఙ్మయం డిజిటలైజేషన్ కావాల్సిన అవసరం ఉందన్నారు. టీవీఎస్ కృష్ణారావు, రంగంపేట జెడ్పీ హైస్కూలు ఉపాధ్యాయురాలు శ్రీపాద సీతామహాలక్ష్మి, ఏబీ కృష్ణశర్మ, మాదిరాజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందుల వాడకంతో అనర్థాలు


రైతులకు సూచనలు చేస్తున్న ఏవో భీమరాజు

రాజమహేంద్రవరం రూరల్: వరిలో పురుగు మందుల వాడకం వల్ల అనర్థాలు కలుగుతాయని, వాటిని తగ్గిస్తే నాణ్యమైన దిగుబడి పొందవచ్చని మండల వ్యవసాయాధికారి ఏ.భీమరాజు అన్నారు. రాజవోలు గ్రామంలో శుక్రవారం జరిగిన పొలంబడి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వరి సాగు విధానం, మేలైన పద్ధతులు, పొలంబడి ఆవశ్యకతను తెలిపారు. మట్టి, నీరు నమూనాల సేకరణ, విత్తన ఎంపిక, మొలక శాతం పరీక్ష, విత్తన శుద్ధి, మట్టి పరీక్ష ఆధారంగా ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. వివిధ రకాల తెగుళ్లు, వాటి నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి పీటర్, వ్యవసాయ సహాయకుడు దుర్గబాబు, కేకే మౌని, రైతులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

ధవళేశ్వరం: దేశ వ్యాప్తంగా ఈ నెల 9వ తేదీన జరగనున్న సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమా మహేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం జరిగిన హార్లిక్స్ ఫ్యాక్టరీ గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా, కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగంలో నూతన మార్కెట్ విధానాన్ని, అన్ని పంటలకు గిట్టుబాటు ధర నిర్ణయించాలన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్లకు వ్యతిరేకంగా, బీజేపీ, అనుబంధ పార్టీల ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హార్లిక్స్ యూనియన్ కార్యదర్శి కర్రి రామకృష్ణ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్, జిల్లా నాయకులు టి.అరుణ్ పాల్గొన్నారు.

మెగా వైద్యశిబిరం

రాజమహేంద్రవరం రూరల్: కాతేరులోని వెంకటాద్రి గార్డెన్స్‌లో శుక్రవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఆంధ్రా పేపర్‌మిల్లు లిమిటెడ్ ఆధ్వర్యంలో నున్న కృష్ణ.నాని నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. వివిధ హాస్పిటళ్లకు చెందిన వైద్యులు గుండె, ఎముకలు, కీళ్లు, నరాలు, కంటి, దంతం, చెవి, ముక్కు వైద్యసేవలు అందించారు. ఆంధ్రాపేపర్ మిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ముకేష్ జైన్, కంపెనీ సెక్రటరీ విజయకుమార్ సింగ్, తాతారావు పాల్గొన్నారు.

రంగా విగ్రహావిష్కరణ


రంగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

కడియం: మండలంలోని మాధవరాయుడుపాలెంలో వంగవీటి మోహనరంగా విగ్రహావిష్కరణ శుక్రవారం ఘనంగా జరిగింది. ఆయన జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తోట త్రిమూర్తులు, జక్కంపూడి గణేష్, వంగవీటి నరేంద్ర పాల్గొని రంగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అన్నందేవుల చంటి తదితరులు పాల్గొన్నారు.

పోటీ పడితే పతకమే

- క్రీడల్లో సత్తాచాటుతున్న విద్యార్థులు
- జాతీయ స్థాయిలో విజయాలు


కిక్ బాక్సింగ్ స్టేట్ ప్రో చాంపియన్ షిప్ బెల్ట్ టైటిల్ సాధించిన అశిక్ రాజ్‌ను అభినందిస్తున్న ఎస్‌కేవీటీ ప్రిన్సిపాల్ తిరుపాణ్యం

ప్రకాశం నగర్: సాంస్కృతిక రాజధాని అయిన రాజమహేంద్రవరంలో విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారు. బాక్సింగ్, యోగా వంటి వాటిలో సత్తా చాటుతూ పతకాలు సాధించి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాజమహేంద్రవరం ఖ్యాతిని వ్యాప్తి చేస్తున్నారు. వీరందరూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు కావడం విశేషం. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన థర్డ్ ఏపీ స్టేట్ ఓపెన్ కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో 78 కేజీల పురుషుల విభాగంలో ఎస్‌కేవీటీ కళాశాల విద్యార్థి జి.అశిక్ రాజ్ స్టేట్ ప్రో చాంపియన్ షిప్ 2025 బెల్ట్ టైటిల్‌ను సాధించాడు. అతడు బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సుమారు 13 జిల్లాల నుంచి 150 మంది బాక్సర్లు పాల్గొన్న ఆ పోటీల్లో తమ కళాశాల విద్యార్థి ఈ ఘనత సాధించడం గర్వంగా ఉందని ప్రిన్సిపాల్ బి.తిరుపాణ్యం అన్నారు. విద్యార్థి అశిక్ రాజ్, కోచ్ కె.భవానీ శంకర్‌లను అభినందించారు.

జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు భవ్యశ్రీ

నెహ్రూ నగర్ మున్సిపాల్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కారుమూరి భవ్యశ్రీ జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. అండర్ – 14 విభాగంలో ఇటీవల కోల్హాపూర్‌లో జరిగిన పోటీలకు హాజరైంది. గేమ్స్ రాష్ట్ర స్థాయి ఎంపికల్లో ఈ ఘనత సాధించింది. ఈ సందర్భంగా ఆ బాలికలను జిల్లా విద్యాశాఖాధికారి కంది వాసుదేవారావు, డీఈ డి.దిలీప్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

కానరాని శిక్షణ

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏటా వేసవి క్రీడా శిక్షణ తరగతుల పేరుతో ఒక నెల రోజుల పాటు వివిధ క్రీడాల్లో విద్యార్థులకు వారికి నచ్చిన ఆటల్లో శిక్షణ ఇచ్చేవారు. వీటితో పాటు స్కూల్ గేమ్స్, ఆడుదాం ఆంధ్రా వంటి పోటీల ద్వారా విద్యార్థుల్లో దాగిన క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు కృషి చేశారు. కాగా.. ప్రసుత్త కూటమి ప్రభుత్వం వేసవి క్రీడా శిక్షణ తరగతులు తూతూమంత్రంగా నిర్వహిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయా క్రీడల్లో విద్యార్థులు రాణించడానికి పీడీలు, క్రీడా శిక్షకులు కృషి చేస్తున్నప్పటికి ప్రభుత్వం నుంచి సరైన సహకారం లేకపోవడంతో క్రీడాకారులు నిరాశకు గురవుతున్నారు.

స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: అదానీ కంపెనీతో సెకీ ద్వారా చేసుకున్న స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని వెంటనే రద్దు చేసుకోవాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ దీనిపై వెంటనే ప్రజలకు స్పష్టత ఇవ్వాలన్నారు. జగన్ పాలనలో స్మార్ట్ మీటర్లను నారా లోకేష్ వ్యతిరేకించారని, యువగళం పాదయాత్ర సమయంలో అనేక విమర్శలు చేశారననారు. స్మార్ట్ మీటర్లు బిగించడానికి అదానీ సంస్థ ఉద్యోగులు ఇళ్లకు వస్తే వాటిని తీసుకుని బద్దలు కొట్టాలని పిలుపునిచ్చారన్నారు. ఆయన చెప్పినట్టుగానే ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లను బిగించడానికి వస్తే.. వాటిని తీసుకుని బద్దలు కొట్టాలన్నారు. ఇళ్లకు, కమర్షియల్ కాంప్లెక్స్‌లకు స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల చాలా ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు దీనిపై వ్యతిరేకంగా మాట్లాడిన చంద్రబాబు, లోకేష్.. ఇప్పుడు స్పందించకపోవడం దారుణమన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్ల జీతాలను రూ.10 వేలకు పెంచుతానని 2,70 వేల మందికి భవిష్యత్తు లేకుండా చేసి మోసం చేశారని ధ్వజమెత్తారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పౌరసరఫరాలశాఖ అధికారిగా పార్వతి


డీఎస్‌వోగా బాధ్యతలు స్వీకరించిన పార్వతి

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి (డీఎస్‌వో)గా వి.పార్వతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మచిలీపట్నం డీఎస్‌వో కార్యాలయంలో సహాయ పౌరసరఫరాలశాఖ అధికారిగా పనిచేస్తూ డీఎస్‌వోగా పదోన్నతిపై ఇక్కడి వచ్చారు. ఇప్పటి వరకూ ఇన్‌చార్జి డీఎస్‌వోగా బాధ్యతలు స్వీకరించిన గెయిల్ డిప్యూటీ కలెక్టర్ ప్రేమ్‌కుమార్ నుంచి వి.పార్వతి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ పి.ప్రశాంతి, జేసీ ఎస్ చిన్నరాముడును ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు.

శాకంబరిగా మాసరమ్మతల్లి



కడియం: ఆషాఢమాసంలోని శుక్రవారాన్ని పురస్కరించుకుని మురమండ గ్రామ దేవత మాసరమ్మ అమ్మవారు శాకంబరిగా దర్శనమిచ్చారు. వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం విశేష రీతిలో కుంకుమపూజలు చేశారు. మూడు రోజుల పాటు అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు విశ్రాంత ఏఈఓల సమావేశం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): విశ్రాంత వ్యవసాయ విస్తరణ అధికారుల రాష్ట్ర సంఘం సమావేశం శనివారం స్థానిక ప్రకాష్ నగర్ ధర్మంచర కమ్యూనిటీ హాలులో నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఉమ్మడి జిల్లా సంఘ అధ్యక్షుడు జీఎం శాంతి కుమార్ తెలిపారు. సమావేశంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి విశ్రాంత ఏఈవోలు పాల్గొని, రాష్ట్ర సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటారని తెలిపారు.

అల్లూరి పోరాటం స్ఫూర్తిదాయకం

- మాజీ ఎంపీ భరత్‌రామ్
- ఘనంగా మన్యం వీరుని జయంతి


వైఎస్సార్ సీపీ నగర కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న మాజీ ఎంపీ భరత్ రామ్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు సాగించిన విప్లవ పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. అల్లూరి జయంతి సందర్భంగా శుక్రవారం వైఎస్సార్ సీపీ సిటీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు

అల్లూరి సీతారామరాజు పోరాట యోధుడని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. గోదావరి గట్టున ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

కంబాలచెరువు: భారత స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిష్ వారికి సింహస్వప్నంగా నిలిచిన గొప్ప పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు అని ఎస్పీ డి.నరసింహ కిశోర్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతి నిర్వహించారు. అడిషనల్ ఎస్పీలు ఎంబీఎన్. మురళీకృష్ణ, ఎల్.అర్జున్, ఎల్.చెంచిరెడ్డి, ఎస్‌బీ డీఎస్పీ బి.రామకృష్ణ, ఏఆర్ డీఎస్పీ రవికుమార్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

- దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయులని నేషనల్ సీనియర్ బేసిక్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డాక్టర్ ఎ.రామకృష్ణ అన్నారు. జాంపేటలోని ఎస్ఎస్‌బీ స్కూల్లో అల్లూరి చిత్రపటానికి పుష్పమాలతో నివాళులర్పించారు.
- స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే, వైస్ ప్రిన్సిపాల్ శ్రీరామమూర్తి పర్యవేక్షణలో చరిత్ర, స్వచ్ఛంద సేవ పథకం విభాగం ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు త్యాగం మరువలేనిదన్నారు.

స్వాతంత్ర్య స్ఫూర్తి 'అల్లూరి'

కడియం: స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తి అల్లూరి సీతారామరాజు అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) అన్నారు. మన్యం వీరుడు అల్లూరి జయంతిని పురస్కరించుకుని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అల్లూరి విగ్రహానికి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో కుసునూరి బాబులు, దాసరి నాగేంద్ర, సర్కార్ బాషా, దొడ్డా బుజ్జి, గుత్తుల వాసు, గుత్తుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

- బీజేపీ ఆధ్వర్యంలో కడియంలోని అల్లూరి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. పారిశుధ్య కార్మికులకు ఫలహార పొట్లాలను పంపిణీ చేశారు. ఆ పార్టీ మండల అధ్యక్షులు బొర్సు సుబ్రహ్మణ్యం, నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు

రాజమహేంద్రవరం రూరల్: అల్లూరి సీతారామరాజు ఆదర్శప్రాయుడని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్ అన్నారు. కాతేరులోని వ్యవసాయ కళాశాలలో శుక్రవారం ఆయన అధ్యక్షతన అల్లూరి సీతారామరాజు జయంతి నిర్వహించారు.

- బొమ్మూరులో పంచాయతీ కార్యాలయం వద్ద అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి సయ్యపురాజు ఫణీంద్రవర్మ, సయ్యపురాజు రాంబాబు వర్మ తదితరులు నివాళులర్పించారు.

ధవళేశ్వరంలో..

ధవళేశ్వరం: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజును ఆదర్శంగా తీసుకోవాలని పలువురు నాయకులు అన్నారు. ఆయన జయంతిని ధవళేశ్వరం మసీదు సెంటర్‌లో మాజీ ఉప సర్పంచ్ మెండా సత్తులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆళ్ల ఆనందరావు, సాధనాల శివ, బొబ్బిలి శ్రీనివాసరావు, శ్రీరంగం బాలరాజు, ముత్యాల పోసి కుమార్, మెండ రాజేష్, యడ్ల మహేష్, యడ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


అల్లూరి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్


కడియంలో అల్లూరి విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న గిరజాల బాబు తదితరులు


ధవళేశ్వరంలో అల్లూరి సీతారామరాజుకు నివాళి

పోరాట యోధుడు మోహన రంగా

- కొనియాడిన వక్తలు
- వంగవీటికి ఘన నివాళి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): బడుగు, బలహీన వర్గాలు, పేదల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం సాగించిన యోధుడు వంగవీటి మోహనరంగా అని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన జయంతి సందర్భంగా స్థానిక ట్రైనింగ్ కాలేజీ వద్ద ఉన్న రంగా విగ్రహానికి రాధారంగా మిత్రమండలి అధ్యక్షుడు వడ్డి మురళి ఆధ్వర్యంలో శుక్రవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ట్రైనింగ్ కాలేజీలో పుస్తకాలు పంపిణీ చేశారు. మాజీ కార్పొరేటర్లు మానే దొరబాబు, ఇసుకపల్లి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు అడపా అనిల్‌కుమార్, కాపు సంఘ నేతలు జగదీష్, వక్కపాటి మురళి, వంశీ, అడపా వరప్రసాద్, సూర్య పాల్గొన్నారు.

రంగా స్ఫూర్తి మరువలేనిది

కడియం: వంగవీటి మోహనరంగా స్ఫూర్తి మరువలేనిదని పలువురు పేర్కొన్నారు. కడియం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన జయంతిని పురస్కరించుకుని విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో కడియం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దగల రంగా విగ్రహానికి పూలమాలలు వేశారు. వివిధ పార్టీల నాయకులు గిరజాల బాబు, వెలుగుబంటి నాని, ఆదిమూలం సాయిబాబా, తాడాల చక్రవర్తి, ఆకుల శ్రీధర్, పసల నాయుడు, కొత్తపల్లి శివాజీ, బొర్సు సుబ్రహ్మణ్యం, గుత్తుల హరిప్రసాద్, చిలుకూరి సుబ్బరాజు పాల్గొన్నారు.

- జేగురుపాడులో రంగా విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ మాట్లాడుతూ రంగా జీవితం ఆదర్శనీయమన్నారు.
- కడియపులంక, పొట్టిలంక, వీరవరం గ్రామాల్లో రంగా విగ్రహాలకు స్థానిక నాయకులు పుష్పాంజలి ఘటించారు. రంగా సేవలను గుర్తు చేసుకున్నారు.

ధవళేశ్వరంలో..

ధవళేశ్వరం: గ్రామంలోని బాలికల హైస్కూల్ సెంటర్‌లో వంగవీటి మోహన రంగా విగ్రహం వద్ద రంగారాధ మిత్రమండలి సభ్యులు, మాజీ ఉప సర్పంచ్ మెండా సత్తులు ఆధ్వర్యంలో జయంత్యుత్సవం నిర్వహించారు. రంగా విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాపు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు జేపీ రామారావు మాట్లాడుతూ పెద్ద ఎత్తున వంగవీటి మోహనరంగా జయంతిని నిర్వహిస్తున్న రంగా రాధ మిత్రమండలి సభ్యులను అభినందించారు. ఇటీవల మృతి చెందిన రంకిరెడ్డి వెంకటేష్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనుశ్రీ సత్యనారాయణ, సాధనాల చంద్రశేఖర్ (శివ), ఆళ్ల ఆనందరావు, శ్రీరంగం బాలరాజు, మెండా రాజేష్, ముత్యాల పోసి కుమార్, యడ్ల మహేష్, ముద్దాల తిరుపతిరావు, నారపరెడ్డి మురళి పాల్గొన్నారు.


ట్రైనింగ్ కళాశాల వద్ద రంగా చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వడ్డి మురళి, మాజీ కార్పొరేటర్లు తదితరులు


కడియంలో రంగా విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న గిరజాల బాబు, వెలుగుబంటి నాని తదితరులు


జేగురుపాడులో పుష్పాంజలి ఘటిస్తున్న సర్పంచ్ స్టాలిన్ తదితరులు


ధవళేశ్వరంలో వంగవీటి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


జిల్లా ఖజానా కార్యాలయం వద్ద జేఏసీ నాయకులు

సీటీఆర్ఐ: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి ఏపీ జేఏసీ కృషి చేస్తోందని రాష్ట్ర జేఏసీ కార్యదర్శి, వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.వేణుమాధవ్ అన్నారు. రాష్ట్ర ట్రెజరీ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు పాము శ్రీనివాసరావు ఏపీ జేఏసీ కో చైర్మన్‌గా ఎన్నికైన సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లా ఖజానా శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం ట్రెజరీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వేణుమాధవ్ మాట్లాడారు. ఏపీ జేఏసీ కో చైర్మన్ పదవి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు దక్కడం గర్వకారణమన్నారు. పెండింగ్ డీఏలు, సరెండర్ లీవ్ బకాయిలపై పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్లతో త్వరలో ఉద్యమ కార్యాచరణకు సిద్ధమవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏపీ ట్రెజరీ ఉద్యోగుల సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సంఘ ఉపాధ్యక్షుడు సీహెచ్ విజయ్ కృష్ణ, ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాజమండ్రి నగర సంఘ ఉపాధ్యక్షులు మీసాల మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌కు రేపు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో ఆదివారం నగరంలోని పలు ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు.

- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ వెంకటేశ్వర మార్కెట్, ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్, శ్యామల నగర్, గాంధీపురం, పాత సోమాలమ్మ టెంపుల్ రోడ్, రహమత్ నగర్, ఎస్‌వీజీ మార్కెట్, గోరక్షణపేట ఏరియాల్లో సరఫరా ఉండదు.
- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ టి.నగర్, అజ్జరపువారి వీధి, బారువారి వీధి, వైగ్రామ్ రోడ్డు, చల్లపల్లివారి వీధి, న్యాపతివారి వీధి, ఇస్కాన్ టెంపుల్, గోదావరి బండ్, ఫ్రింటోనికా కలర్ ల్యాబ్ ఏరియా, జూపూడి వారి వీధి, ఏనుగు గుమ్మాల వీధి, మాటూరి వారి వీధి, టౌన్ హాల్ రోడ్, సురాబత్తుల వారి వీధి, సెంట్రల్ విజిటబుల్ మార్కెట్, రంభ థియేటర్ డౌన్, నిమ్మకాయల మార్కెట్, దత్తసాయి అపార్ట్‌మెంట్స్ డౌన్, ముత్తంగి వారి వీధి, వంకాయల వారి వీధి, మెయిన్ రోడ్, మెరక వీధి, వీరేశలింగం గారి ఇంటి పక్కన, గీత భవనం మొదలగు ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది.

సమస్యల పరిష్కారానికి సమష్టి కృషి


సమావేశంలో పాల్గొన్న ఏపీఎంటీఏ సభ్యులు

సీటీఆర్ఐ: సెల్‌ఫోన్ టెక్నీషియన్ల సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాలని ది రాజమహేంద్రవరం మొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాల్ అన్నారు. ది రాజమహేంద్రవరం మొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ 9వ ఆవిర్భావ దినోత్సవాన్ని కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం కంబాలచెరువు జంక్షన్‌లోని మెగా కన్వెన్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎంటీఏ రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాల్ మాట్లాడుతూ సెల్‌ఫోన్ టెక్నీషియన్ల సమస్యల పరిష్కారానికి, వారి వ్యాపార నైపుణ్యాభివృద్ధికి తోడ్పడాలన్న సత్సంకల్పంతో ఈ అసోసియేషన్ ఏర్పాటు జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నాలి హేమ సుందర్, రాష్ట్ర గౌరవ సలహాదారు మహమ్మద్ ఆరిఫ్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధులకు వినికిడి యంత్రాల వితరణ



వినికిడి యంత్రాలను అందజేస్తున్న గుబ్బల రాంబాబు

రాజమహేంద్రవరం సిటీ: వినికిడి లోపం బాధపడుతున్న ఇద్దరు వృద్ధులకు స్వర్ణాంధ్ర సేవా సంస్థ తరపున వినికిడి యంత్రాలను నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు అందజేశారు. లాలా చెరువు స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ ప్రాంగణంలో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ రాజమహేంద్రవరం కేంద్రంగా స్వర్ణాంధ్ర ద్వారా 27 ఏళ్లుగా అవసరార్థులకు సేవలు అందిస్తున్నామన్నారు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న జూనియర్ ఆర్టిస్టు యు.వీర్రాజుకు వినికిడి యంత్రాన్ని అందజేశామన్నారు. ఆయన కుటుంబానికి నిత్యవసరాలు, నగదు పంపిణీ చేసినట్టు తెలిపారు.